ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు

గురువారం 17 అక్టోబరు 2024





గోపాయపల్లె రహదారిలో కంది పంటలో నిలిచిన వర్షపు నీరు



కలుగొట్లపల్లె వద్ద గల వక్కిలేరు వంతెనపై ప్రవహిస్తున్న వరద

భారీ వర్షం

- 52.9 మి.మీ. వర్షపాతం నమోదు
- పొంగి ప్రవహించిన వక్కిలేరు
- స్తంభించిన రాకపోకలు
- కూలిన మట్టి మిద్దెలు
- నేలరాలిన వందేళ్ల వృక్షం
- నీట మునిగిన పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు




గొడిగనూరు రహదారిలో విరిగి పడిన మహా వృక్షం

కుందూ ఉగ్రరూపం

15 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఎగువ నుంచి వచ్చిన వరద నీటితో బుధవారం కుందూ నది ఉగ్రరూపం దాల్చింది. రాజోలి ఆనకట్ట వద్ద ఉప్పొంగి ప్రవహించింది. 15 వేల క్యూసెక్కులతో ఆనకట్ట వద్ద కుందూ నది ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు నీటి మట్టాన్ని ముందస్తుగా తగ్గించామని చెప్పారు. మరో రెండు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండటంతో కుందూ నది ఉధృతి పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఆనకట్ట వద్దగల గేట్లను ఎత్తి కడప జిల్లా వైపునకు నీటిని విడుదల చేశామని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు నది దాటే ప్రయత్నం చేయరాదని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. 52.9 మి.మీ. వర్షపాతం నమోదైంది. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు పొంగి ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల రాకపోకలు స్తంభించిపోయాయి. గోపాయలపల్లె రహదారిలోని అడ్డవాగు పొంగి ప్రవహించి పంటలు నీట మునిగాయి. మొక్కజొన్న, కంది, పత్తి, మినుము పంటలు వర్షానికి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్వీసు రహదారుల్లో ఆరబెట్టిన మొక్కజొన్న ధాన్యం తడిచి మొలకలు రావడంతో భారీగా నష్టపోయారు. గొడిగనూరు గ్రామంలో రహదారిపై వందేళ్ల చింత చెట్టు నేలకొరిగి రాకపోకలకు అంతరాయం కలిగింది. తోడెండ్లపల్లె గ్రామంలో శ్రీరాములుకు చెందిన మట్టిమిద్దె కూలింది. ఇంటిలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. గొడిగనూరు తదితర గ్రామాల్లో మట్టి మిద్దెలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంట పొలాలు, మట్టి మిద్దెలకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



తోడెండ్లపల్లెలో కూలిన మట్టి మిద్దె

నేడు వాల్మీకి జయంతి



కొలిమిగుండ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తరతరాలుకు ఆదర్శంగా నిలిచిన రామాయణాన్ని సమాజానికి అందించిన ఆది కవి వాల్మీకి జయంతిని ఏటా అక్టోబరు 17న నిర్వహిస్తున్నారు. గురువారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసింది. ఇందుకోసం ప్రత్యేక నిధులను సైతం వెచ్చించి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. మరోవైపు జిల్లా వ్యాప్తంగా అధికారగణంతో పాటు, వాల్మీకి కుల సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించడానికి నాయకులు సిద్ధమయ్యారు.

తమ్ముడి కోసమే అఖిలప్రియ రాజకీయం

విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి

నంద్యాల రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : జగత్‌విఖ్యాత్ రెడ్డిని విజయ డెయిరీ చైర్మన్‌గా చేసేందుకు ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అనవసర రాజకీయం చేస్తోందని విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. విజయ డెయిరీలో ఎన్టీఆర్ శిలా ఫలకాన్ని తీసివేశారన్న విషయంపై ఎమ్మెల్యే అఖిలప్రియ తాను లేని సమయంలో వచ్చి హల్‌చల్ చేసిన విషయంపై స్పందిస్తూ బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ డెయిరీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ నెల 15న ప్రారంభించబోతున్నామన్నారు. ఇందుకు రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిని ఆహ్వానించామని తెలిపారు. వారి రాకను అడ్డుకునేందుకు ఎమ్మెల్యే అఖిలప్రియ ఎన్టీఆర్ శిలాఫలకం డ్రామాకు తెరతీశారన్నారు. తాము ప్రభుత్వంతో సఖ్యతగా ఉండాలని ప్రయత్నిస్తున్నా ఆమె పడనివ్వటం లేదని ఆరోపించారు. శిలాఫలకాన్ని ఆమెకు సంబంధించిన వ్యక్తులే పడేసి రాద్ధాంతం చేస్తున్నారని, ఈ విషయం నిగ్గు తేల్చాలని తాము పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. డెయిరీలో 40 ఏళ్లలో చేయని అభివృద్ధిని తాము చేసి చూపించామన్నారు. రూ.45 కోట్ల ఆదాయాన్ని చూపించి రూ.15 కోట్లు పాడి రైతులకు బోనస్‌గా ఇచ్చామని చెప్పారు. వీటిన్నింటినీ గుర్తించకుండా సీఎం చంద్రబాబు నాయుడు వద్ద మెప్పు కోసం డెయిరీకి వచ్చి ఇలాంటి రాజకీయం చేయడం తగదన్నారు. అఖిలప్రియ, ఆమె తమ్ముడు జగత్‌విఖ్యాత్‌రెడ్డి భాగస్తులుగా ఉండి జగత్ డెయిరీని నడిపిస్తున్నారని, ప్రైవేటు పాల డెయిరీని నడిపే వ్యక్తికి విజయ డెయిరీ చైర్మన్‌గా పోటీ చేసేందుకు అనర్హులన్నారు. పైగా డెయిరీ నుంచి రూ.1.23 కోట్లు లోన్ తీసుకుని కట్టలేదని, వడ్డీతో లెక్కిస్తే వారు కట్టాల్సిన సొమ్ము రూ.2 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.



నిండు కుండలా శ్రీశైలం జలాశయం

శ్రీశైలం, అక్టోబరు 16: నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి బుధవారం వరద ప్రవాహం కొనసాగింది. ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో బుధవారం తెరవాల్సిన డ్యాం క్రస్టుగేట్లను తాత్కాలికంగా అధికారులు వాయిదా వేశారు. ఎగువ పరివాహక ప్రాంతాలు జూరాల నుంచి 39,357 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 34,216 క్యూసెక్కులు మొత్తం 73,573 వరద నీరు వస్తోంది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 78,645 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 884.40 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుతం 211.9572 టీఎంసీలుగా నమోదైంది.

ముప్పు తప్పాలంటే అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్



నంద్యాల రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల వల్ల ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందు వల్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ బుధ, గురువారాలు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో తక్షణ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విపత్తు నిర్వహణ శాఖ అధికారులు వారం రోజులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాలలో ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి అప్రమత్తం చేయాలన్నారు

బాధ్యతలు స్వీకరించిన అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్



ఫీల్డ్ డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

నంద్యాల రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఫీల్డ్ డైరెక్టర్ ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్‌గా బీవీఏ క్రిష్ణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఫారెస్ట్ కార్యాలయంలో పులుల సంరక్షిత నంద్యాల సంచాలకులుగా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. మంగళగిరి ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు ఫారెస్ట్ డిప్యూటీ డైరెక్టర్, కార్యాలయ ఏవో నరసింహులు, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందలు తెలిపారు.



మిరప ధర పతనం

- తెగుళ్లతో దెబ్బతిన్న పంట
- కూలి ఖర్చులు కూడా రాని వైనం
- మిరప పంటను తొలగిస్తున్న రైతులు
- నష్టపోతున్నామంటూ రైతుల ఆవేదన

చాగలమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఏటా ఏదో ఒక కారణంతో నష్టాలు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది పచ్చిమిర్చి పంటకు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న పచ్చి మిర్చి ధర నేడు అమాంతంగా పడిపోయింది. ధర పతనానికి తోడు మిర్చి పంటను తెగుళ్లు దెబ్బతీశాయి. జిల్లాలో వరి, మొక్కజొన్న, కంది, పత్తి తరువాత పచ్చిమిర్చి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. రుద్రవరం, చాగలమర్రి, శిరివెళ్ల, పాణ్యం, బనగానపల్లె మండలాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. జిల్లాలో 12,362 హెక్టార్లలో సాధారణంగా మిర్చి సాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు 6,420 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మిరపలో నలుపు రకానికి చెందిన కృష్ణ, తెలుపు కాయలకు సంబంధించి డింపుల్ రకాలను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ధరలు పతనం కావడంతోపాటు తెగుళ్ల వల్ల మిరప రైతులు సాగు వైపు ఆసక్తి చూపడం లేదు.



డి. వనిపెంటలో మిరప పంటను దున్నేస్తున్న రైతు

ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో ఇలా..

పచ్చిమిర్చి ధరలు తగ్గాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని చాగలమర్రి, రుద్రవరం, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, శిరివెళ్ల, దొర్నిపాడు మండలాల్లో 1200 ఎకరాల దాక మిరప పంట సాగు చేశారు. ఒక్క చాగలమర్రి, రుద్రవరం మండలంలోని 900 ఎకరాలకు పైగా మిరప పంట సాగు చేశారు. ఆలమూరు, రుద్రవరం, రెడ్డిపల్లె, తువ్వపల్లె, ఆర్.నాగులవరం, చాగలమర్రి మండలంలో కొత్తపల్లె, డి.వనిపెంట, గొడిగనూరు, ఆళ్లగడ్డ మండలంలోని చింతకొమ్మదిన్నె, కృష్ణాపురం, మర్రిపల్లె, బాచేపల్లె తాండ, ఉయ్యాలవాడ మండలంలో ఇంజేడు, ఉయ్యాలవాడ, రూపనగుడి, సర్వాయిపల్లె తదితర గ్రామాల్లో మిరప పంట సాగు చేశారు. మార్కెట్‌లో మిరపకు గిట్టుబాటు ధర లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మిగతా 6లో..



- జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న వీరేష్
- పట్టుదల ముందు చిన్నబోయిన పేదరికం
- ఆటో డ్రైవర్ కుమారుడి ప్రతిభ
- రెండేళ్లుగా కర్నూలులో కఠోర శిక్షణ

యువ

వెయిట్ లిఫ్టింగ్ వీరుడు

బాణాన్ని ఎంత వెనక్కి లాగితే అంతగా అది ముందుకు దూసుకుపోతుంది. వీరేష్ కూడా ఎక్కుపెట్టిన బాణమే. పేదరికం అడ్డువచ్చినా వెనక్కు తిరిగి చూడలేదు. ఇష్టమైన వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆ యువకుడి పట్టుదల ముందు పేదరికం చిన్నబోయింది. కౌతాళం మండలంలోని మారుమూల ఉన్న తోవి గ్రామానికి చెందిన బైరిగడ్డ వీరేష్ వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.


వీరేష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్

కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలం తోవి గ్రామానికి చెందిన బైరిగడ్డ అయ్యన్న, హనుమంతమ్మ దంపతుల కుమారుడు బైరిగడ్డ వీరేష్ ప్రస్తుతం బీఏ సెకండ్ ఇయర్ చదవుతున్నాడు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. వీరేష్ ఇక్కడి నుంచి 5వ తరగతి వరకు కౌతాళం మండలం తోవి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. 6 నుంచి 10 వరకు విజయవాడ స్పోర్ట్స్ స్కూల్‌లో చదివాడు. ఇంటర్ ఎస్‌వీ కళాశాల, తిరుపతిలోనూ, ఆదోనిలో ఆర్ట్స్ కళాశాలలో బీఏ చదువుతున్నాడు. విజయవాడ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్నప్పటి నుంచే వెయిట్ లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. ఆపై జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంలో కృషి చేశాడు. పేదరికం అడుగడుగున అవాంతరాలు సృష్టిస్తున్నా.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని వెయిట్ లిఫ్టింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తున్నాడు. ఈ క్రమంలో హిమాచల్‌ప్రదేశ్‌లో త్వరలో జరగబోయే జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలకు ఎంపికయ్యాడు.


బంగారు పతకాలతో వీరేష్

సాధించిన పతకాలు ఇవే..

- 2019 ఫిబ్రవరి 14 తేదీల్లో కేరళలో జరిగిన సౌజన్య నేషనల్‌లో నాలుగో స్థానం
- 2022 మార్చి 23న కర్నూలు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌లో మొదటి స్థానం
- 2022 జూన్ 8, 10 తేదీల్లో జరిగిన ఏపీ వెయిట్ లిఫ్టింగ్‌లో మూడో స్థానం
- 2022 జూలై 16, 1 తేదీల్లో నంద్యాలలో జరిగిన పవర్ లిఫ్టింగ్‌లో మొదటి స్థానం
- 2023 జనవరి 25న వెయిట్ లిఫ్టింగ్‌లో సీఎం కప్ సెలక్షన్‌లో మొదటి స్థానం
- 2023 మే 15న తిరుపతిలో జరిగిన సీఎం కప్ వెయిట్ లిఫ్టింగ్‌లో మూడో స్థానం
- 2022లో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం
- 2019లో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో జరిగిన సౌత్‌జోన్ వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం.
- 2023లో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో జరిగిన పోటీల్లో 61 కిలోల విభాగంలో స్నాచ్113 కిలోలు, క్లీన్/జర్క్‌లో 138 కిలోల బరువు (మొత్తం 251 కిలోలు) ఎత్తి జూనియర్, సీనియర్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. రాష్ట్ర స్థాయిలోనే బెస్టు లిఫ్టర్ అవార్డును సైతం సొంతం చేసుకున్నాడు
- 2024 ఆగస్టు నెలలో అనకాపల్లి జిల్లాలో జరిగిన 11వ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 51 కిలోల విభాగం పోటీల్లో పాల్గొని 109 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 135 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించాడు. సీనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు.

ఇంటర్నేషనల్ పోటీలే లక్ష్యం

ఈనెలలో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2024 కోసం కోచ్ యూసుఫ్ బాషా ఆధ్వర్యంలో గట్టిగా ప్రయత్నిస్తున్నా. జాతీయ, అంతర్జాతీయ, ఒలింపిక్స్ పోటీల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తున్నా. అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తానన్న ధీమా ఉంది. స్పాన్సర్స్ ముందుకు వచ్చి సహాయం చేస్తే మంచి పేరు తీసుకొస్తా.

- బైరిగడ్డ వీరేష్, వెయిట్ లిఫ్టర్

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో మైత్రి చౌదరి ప్రతిభ


ఇండియా త్రోబాల్ జట్టులో మైత్రి చౌదరి

బేతంచెర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ త్రోబాల్‌లో బేతంచెర్ల విద్యార్థిని మైత్రి చౌదరి చదువుతోపాటు పాటు క్రీడల్లో రాణిస్తోంది. బేతంచెర్ల పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త తిరుమలేశ్ చౌదరి, ఉమా మహేశ్వరి దంపతుల కుమార్తె మైత్రి చౌదరి హైదరాబాదులోని వీఏఎస్ఆర్ విజ్ఞాన్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతోంది. మైత్రి చౌదరి ఇండో థాయిలాండ్ త్రోబాల్ టెస్టు సిరీస్-2024 అంతర్జాతీయ త్రోబాల్ పోటీలు బ్యాంకాక్‌లోని కసెమ్‌బండిట్ యూనివర్సిటీలో ఈ నెల 10న జరిగాయి. ఈ పోటీల్లో శ్రీలంక, ఇండియా, బంగ్లాదేశ్, థాయిలాండ్ తదితర దేశాలకు చెందిన జట్లుతలబడ్డాయి. పోటీల్లో మైత్రి చౌదరి తెలంగాణ జట్టు తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి షీల్డ్, మెడల్ ప్రశంసాపత్రం అందుకుంది. మైత్రి చౌదరిని కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులు పలువురు అభినందించారు.


షీల్డ్ అందుకుంటున్న మైత్రి చౌదరి

టెట్‌కు 673 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన టెట్‌కు మొత్తం 4369 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం పరీక్షకు 2083 మందికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 673 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కరూాను 1763 మంది హాజరు కాగా 320 మంది గైర్హాజరయ్యారు. మధ్యా హ్నం పరీక్షకు 2286 మంది మందికి గానూ 1933 మంది హాజరు కాగా, 353 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈవో శామ్యూల్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేశాయి.

సీడ్స్ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వాలి


మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సుబ్బారెడ్డి

డోన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్‌కు రావాల్సిన నిధులు విడుదల చేయాలని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి కోరారు. బుధవారం అమరా వతిలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. విత్తనాభివృద్ధి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సహకారాలు అందిం చాలని కోరారు. నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన పయ్యావుల కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాం క్షలు తెలిపారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆశీస్సుల తో రాష్ట్రంలో రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా చేపడుతామన్నారు. ముందుగా తమ సంస్థను ఆర్థికంగా బలోపేతం చేసేలా దృష్టి సారించామన్నారు.

జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకురండి - కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 15 ఆంధ్రజ్యోతి : స్వర్ణాంధ్ర 2047లో భాగంగా నంద్యాల జిల్లాకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలనే ఉద్దేశంతో అధికారులు నిర్దిష్ట లక్ష్యంతో పనుల చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

కాన్ఫరెన్స్ హాల్లో స్థూల దేశీయోత్పత్తి, ఆదాయ వృద్ధిరేట్లపై జిల్లా అధికారులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఏపీ అభివృద్ధి ప్రతి ఏడాది15శాతం గ్రోత్ రేట్ లక్ష్యంతో పనిచేయాలనే ముఖ్యమంత్రి ఆదేశం మేరకు అన్ని శాఖలు తమ వృద్ధి రేటును ప్రతి ఏటా 15శాతం పెంచుకుంటా నిర్దిష్ట ప్రణాళికలతో పని చేయాలన్నారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగాలతో పాటు విద్య, వైద్యం, ఇరిగేషన్ తదితర అన్ని రంగాలలో అభివృద్ధి నివేదికలు తయారు చేసే విధానంపై నిపుణులైన మాస్టర్లచే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా స్థాయి ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

సీసీఐ ఉద్యోగాలకు ముగ్గురి ఎంపిక


టి.లక్ష్మీభార్గవి


బి.రవిచంద్ర


మధుకుమార్

మహానంది, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల వెలు వరించిన ఫలితాల్లో మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల విద్యార్థులు మూడు ర్యాంకులు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన సీసీఐ పరీక్షల్లో కళాశాలకు చెందిన 2018-2022వ బ్యాచ్ విద్యార్థిని టి.లక్ష్మీభార్గవి మొదటి ర్యాంకు సాధించి వరంగల్‌లోని సీసీఐలో ఉద్యోగం సాధించింది. అలాగే ఇదే కళాశాలలో చదివిన మరో విద్యార్థి రవిచంద్ర 39వ ర్యాంక్ సాధించి వరంగల్ సీసీఐలోనే ఉద్యోగం సంపాదించాడు. అలాగే 76వ ర్యాంక్ సాధించిన మరో విద్యార్థి మధుకుమార్ గుంటూరు సీసీఐలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. వీరిని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి, శాస్త్రవేత్తలు, సిబ్బంది అభినందించారు.

లోక్ అదాలత్‌లో న్యాయం

బాధితుడికి రూ.3 లక్షలు

కర్నూలు లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి లైసెన్సు కాల పరిమితి ముగియడంతో నష్టపోయిన ఫిర్యాదుదారుడికి శాశ్వత లోక్ అదాలత్ జోక్యం వల్ల న్యాయం జరిగింది. ఈ మేరకు వైద్య ఖర్చులు చెల్లించేందుకు సదరు ఆసుపత్రి అంగీకరించినట్లు కర్నూలు శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం.వెంకట హరినాథ్, సభ్యులు టి.శివశంకర్ రెడ్డి, డి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాలకు చెందిన ఫిర్యాదుదారుడు కర్నూలు టీబీ యూనిట్‌లో సూపర్‌వైజర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన అనారోగ్యానికి గురి కావడంతో మెడికల్ రీయింబర్స్‌మెంటు సదుపాయం ఉన్న సన్‌షైన్ ఆసుపత్రిలో గత ఏడాది ఏప్రిల్ 13న అడ్మిట్ అయ్యాడు. ఆ తర్వాత డిశ్చార్జ్ అయి రూ.4,17,611 బిల్లులను మెడికల్ రీయింబర్స్‌మెంటు కింద రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఆయన లైసెన్సు పునరుద్ధరణ కాలేదని, ఆ ఆసుపత్రి కిమ్స్ ఆసుపత్రిలో విలీనమైపోయిందనే కారణాలతో ఫిర్యాదుదారుడు చేసుకున్న క్లెయిమ్‌ను ఏపీ వైద్యఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టు తిరస్కరించింది. దీంతో ఖంగుతిన్న ఆయన శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు సన్‌షైన్ ఆసుపత్రి అధికారులు శాశ్వత లోక్ అదాలత్‌కు హాజరై రూ.3 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ఫిర్యాదికి చెల్లించేందుకు అంగీకరించారు. దీంతో ఫిర్యాది తన కేసును ఉపసంహరించుకునేందుకు అంగీకరించినట్లు శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్ తెలిపారు.


చెక్కును అందజేస్తున్న శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ వెంకట హరినాథ్ తదితరులు

బనవాసి కేవీకేలో శిక్షణ ప్రారంభం


మాట్లాడుతున్న డీసీవో రామాంజనేయులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికెట్ కోర్స్ శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా కార్యక్రమాల్లో మొదటి రోజు డీసీవో రామాంజనేయులు పాల్గొని కోర్స్ ఆవశ్యకతను తెలియజేశారు. డీసీవో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లోని రైతులకు జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంస్థ ఆధ్వర్యంలో రెండు వారాల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు నేల రకాలు, నేలలోని మొక్కల పోషకాలు, భూమిలోని ప్రాథమిక, ద్వితీయ పోషకాల పాత్ర, వాటిలోప లక్షణాలు, మొక్కలలోని సూక్ష్మపోషకాల పాత్ర, సేంద్రీయ ఎరువుల రేటింగ్ వంటి వివరాలు తెలియజేసినట్లు చెప్పారు. కేవీకే కో-ఆర్డినేటర్ రాఘవేంద్ర, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత, సుజాతమ్మ, నాగేంద్రయ్య, శ్రీచందన, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరిస్తున్నాడు

- డోన్ సీఐపై బార్ అసోసియేషన్‌కు టీడీపీ మండల అధ్యక్షుడి ఫిర్యాదు


డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుకి ఫిర్యాదు చేస్తున్న న్యాయవాది, టీడీపీ నేత శ్రీనివాసులు యాదవ్

డోన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డోన్ మండల టీడీపీ అధ్యక్షుడు, న్యాయవాది శ్రీనివాసులు యాదవ్ డోన్ బార్ అసోసియేషన్‌కు చేసిన ఫిర్యాదు కలకలం రేపుతోంది. ఊరిలో రాజకీయం మానుకోకపోతే ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరిస్తున్నాడని, విచక్షణారహితంగా దాడి చేశాడని డోన్ పట్టణ సీఐతోపాటు ఎస్ఐ, మరో ఇద్దరు పోలీసు సిబ్బందిపై బార్ అసోసియేషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో శ్రీనివాసులు యాదవ్ పేర్కొనడం చర్చగా మారింది. బుధవారం డోన్‌లో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మండలంలోని వెంకటనాయునిపల్లెలో ఈ నెల 13వ తేదీన తమ ఇంటి దగ్గర వేరే వ్యక్తితో చిన్న ఘర్షణ జరిగిందని అన్నారు. సమాచారాన్ని తెలుసుకున్న పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ నరేంద్ర కుమార్, మరో ఇద్దరు పోలీసు సిబ్బంది గ్రామానికి చేరుకుని తనతో పాటు తన తమ్ముడు సత్యంరాజును బలవంతంగా వాహనంలో తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారని తెలిపారు. దుర్భాషలాడుతూ ఊరిలో రాజకీయం చేస్తున్నారని, మానుకోకపోతే ఇద్దరిని ఎన్‌కౌంటర్ చేస్తానని బెదిరింపులు చేసినట్లు బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించి బూటు కాళ్లతో, ప్లాస్టిక్ పైపులతో విచక్షణారహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగేలా చూడాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు, జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

మిరప ధర పతనం

5వ పేజీ తరువాయి

మిరప కాయలను రైతులు ఆటోలలో మైదుకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ తదితర మార్కెట్‌లకు తరలించి విక్రయిసు న్నారు. అయితే ధరలు పడిపోవడం వల్ల రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఒక్కో కూలీకి రోజుకు రూ.350 చొప్పున చెల్లిస్తుండగా ఆ మొత్తమైన రావ డం లేదు. 50 కిలోల సంచి రూ.300 పలుకుతోంది. రూ.300కే దళారులు కొంటున్నారు. దీంతో కిలో రూ.5 నుంచి రూ.6 మాత్రమే మార్కెట్‌లో ధర వస్తున్నదని తెలిపారు. ఈ మొత్తం కూలీలకు రవాణాకు సరిపోతుందని రైతులు విలపిస్తున్నారు. మిరప పంట పొలం నుంచి రైతులు సొంతంగా మార్కెట్‌కు తరలించినందుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఆటోలకే చెల్లించాల్సి వస్తున్నది. దీంతో మిరప పంట సాగు చేసి నష్టపోయామని వాపోతున్నారు.

పంట తొలి దశలో రూ.2 వేలు

జిల్లాలో సాగు చేసిన మిరప పంట జూలై మూడో వారంలో తొలి కోత దశకు వచ్చింది. పంట చేతికొచ్చే సమయంలో 50 కేజీలు రూ.750 ధర పలికింది. ఇవే ధరలు రెండు నెలల పాటు కొనసాగితే తమ అప్పులన్నీ తీరిపోతాయని రైతులు అనుకున్నారు. కానీ కేవలం వారం రోజులే ఈ ధర పలికింది. 8వ రోజు నుంచి ధర పతనమవుతూ కిలో రూ.5కు చేరింది. నెల రోజుల్లోనే భారీగా పచ్చిమిర్చి ధరలు పతనమయ్యాయి. కాయలు కోసేందుకు వచ్చే కూలీలకు ఇవ్వడానికి కూడా ఈ డబ్బు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. మరో వైపు రుద్రవరం, చాగలమర్రి తదితర మండలాల్లో సాగు చేసిన మిరపలో అధిక శాతం మిరప పంట బింగి తెగుళ్ల బారిన పడింది.

ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి

జిల్లాలోని రైతులు మిరప మొక్కల కోసం గుంటూరు వెళ్తుంటారు. ఒక్కో మొక్కను రూ.1 నుంచి రూ.5 వరకు ధర


కొత్తపల్లెలో తెగుళ్లతో దెబ్బతిన్న మిరప తోట


పచ్చిమిర్చిని కోస్తున్న మహిళా కూలీలు

పెట్టి కొంటారు. మరి కొంత మంది రైతులు నర్సరీల్లో కొంటారు. అధిక శాతం మంది రైతులు మిరప నారునే కొని నాటుతారు. నాలుగు నెలల పాటు మిరప పంటను కాపాడుకుంటారు. ఎకరాకు సుమారుగా 40 వేల మొక్కలను నాటుతున్నారు. మందులు, కూలీలు, కలుపు నివారణ కోసం ఎకరాకు రూ.60 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. కానీ తెగుళ్ల సోకడం, ధరలు పడిపోవడంతో ఎకరాకు రూ.40 వేలు కూడా రావడం లేదు. దీంతో ఒక్కో ఎకరాకు రూ.60 వేల వరకు నష్టపోతున్నారు. మరో వైపు కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మార్కెట్‌లో పచ్చి మిర్చి ధరలు నిలకడగానే కొనసాగుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లో కేజీ రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. కానీ రైతులకు మాత్రం కేజీ రూ.5 నుంచి రూ.6లతో సరి పెడుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కూరగాయలు సాగు చేసే రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్లతో దున్నేస్తున్న రైతులు

జిల్లాలోని ఆయా మండలాల్లో మిరప సాగు చేసిన రైతులు ధర లేక పోవడంతో ట్రిల్లర్లతో దున్నేస్తున్నారు. ప్రస్తుతం రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో ధర లేక తెగుళ్లతో దెబ్బతిన్న పంటను ట్రిల్లర్లతో తొలగిస్తున్నారు. డి.వనిపెంట, ఆలమూరు, బీరవోలు, చందలూరు, చిన్నకంబలూరు, రుద్రవరం, టి.లింగం దిన్నె గ్రామాల్లో రైతులు మిరప పంటను తొలగించి ప్రత్యామ్నాయ పంట సాగు చేసేందుకు దృష్టి సారించారు.

గిట్టుబాటు కావడం లేదు



మిరపకు మార్కెట్‌లలో ధర లేక నష్టపోయాం. రెండు ఎకరాల్లో మిరప సాగు చేశా. ఎకరాకు రూ.90 వేలు పెట్టుబడి పెట్టా. పంట కోతకు వచ్చే సమయంలో ధర పడిపోయింది. వచ్చిన మిరప పంట కూలీలకు, రవాణా ఖర్చులకే సరిపోతున్నది. ఆలమూరు నుంచి వ్యాపారులు వచ్చి మిరపను కొనుగోలు చేస్తారు. వారు చెప్పిన ధరకే ఇవ్వాల్సి వస్తోంది. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు.

-ఈశ్వర్‌రెడ్డి, రైతు, కొత్తపల్లె గ్రామం

పంటను దున్నేశా



తెల్లమిరప పంట సాగు చేసి భారీగా నష్టపోయా. 4 ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఒక్కో ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టా. తెగుళ్లు సోవడంతో వారానికి రెండు సార్లు మందులు పిచికారి చేశా. అయిన తెగుళ్లు తగ్గలేదు. ధరలు కూడా లేవు. రూ.4 లక్షలు ఖర్చు చేసిన పెట్టిన పెట్టుబడి, కూలీల డబ్బు రాకపోవడంతో పంటను దున్నేశా. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

-వీరయ్య, రైతు, డి. వనిపెంట గ్రామం

పెట్టుబడులు రావడం లేదు



నాలుగు ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశా. ధర పతనమైంది. మిరప పంట దిగుబడి బాగానే ఉంది. ధర లేక పోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. మార్కెట్‌కు తీసుకెళ్తే రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. పంటలకు తెగుళ్లు సోకితే ఏ మందు పిచికారి చేసుకోవాలో అధికారులు చెప్పడం లేదు. తెగుళ్లు, ధరలు లేకపోవడంతో భారీగా నష్టపోతున్నాం. ప్రత్యామ్నాయ పంట సాగు చేయడానికి మిరప పంటను దున్నేశాను.

-చిన్నబయన్న, రైతు, డి. వనిపెంట గ్రామం

న్యూస్ బాక్స్

నేటి నుంచి స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు, అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, ఎం.ఎ, ఎం.కామ్ స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నరసింహులు తెలిపారు. కన్వీనరు కోటాలో మిగిలిన సీట్లకు ఏపీపీజీసెట్-2024 అర్హత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 17, 18 తేదీల్లో వర్సిటీలోని అడ్మినిస్ట్రేషన్ కార్యాల యంలో ఆర్ట్స్‌కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాల యంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు వర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఉర్దూ వర్సిటీలో..

నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యాసంవత్స రానికి పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహి స్తున్నట్లు రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. పీజీ కోర్సుల్లో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ ఎకానామిక్స్, ఎంఏ ఉర్దూ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంఎస్సీ బాటనీ, ఎంఎస్సీ జువాలజీ, ఎమ్మెస్సీ ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో చేర్చుకునేం దుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావా లన్నారు. 8341511632, 9959758609కు సంప్రదించాలని సూచించారు.

హెచ్‌ఆర్సీ కార్యదర్శిగా చిరంజీవి బాధ్యతలు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి చిరంజీవి బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌ఆర్సీ అధికారులు, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కమిషన్ ప్రజా పౌర సంబంధాల అధికారి హనుమంతరెడ్డి, సునీత, నరసింహకుమార్, సురేష్‌బాబు, శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

టెట్‌కు 673 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన టెట్‌కు మొత్తం 4369 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం పరీక్షకు 2083 మందికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు 673 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో 1763 మంది హాజరు కాగా 320 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 2286 మంది మందికి గానూ 1933 మంది హాజరు కాగా, 353 మంది గైర్హాజరయ్యారు. డీఈవో శామ్యూల్, డిపార్టుమెంట్ ఆఫీసర్లు, స్క్వాడ్ తనిఖీలు చేశాయి.

బనవాసి కేవీకేలో శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో సమగ్ర పోషక యాజమాన్యం సర్టిఫికెట్ కోర్స్ శిక్షణా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా కార్యక్రమాల్లో మొదటి రోజు డీసీవో రామాంజనేయులు పాల్గొని కోర్స్ ఆవశ్యకతను తెలియజేశారు. డీసీవో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లోని రైతులకు జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంస్థ ఆధ్వర్యంలో రెండు వారాల పాటు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి రోజు నేల రకాలు, నేలలోని మొక్కల పోషకాలు, భూమిలోని ప్రాథమిక, ద్వితీయ పోషకాల పాత్ర, వాటిలోప లక్షణాలు, మొక్కలలోని సూక్ష్మపోషకాల పాత్ర, సేంద్రీయ ఎరువుల రేటింగ్ వివరాలు తెలియజే సినట్లు చెప్పారు. కేవీకే కో-ఆర్డినేటర్ రాఘవేంద్ర, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీలత, సుజాతమ్మ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు



- ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ ధనలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత రబీలో రైతులకు రాయితీపై పప్పుశనగ విత్తనాలను అందిస్తున్నట్లు ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ మేనేజర్ ధనలక్ష్మి తెలిపారు. బుధవారం కల్లూరు ఎస్టేట్‌లోని ఏపీ సీడ్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన పప్పుశనగ విత్తనాలను నాణ్యత కలిగి క్లీనింగ్ చేసిన విత్తనాలను నందికొట్కూరు, కడప ప్రాంతాల్లోని ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి రైతు సలహా కేంద్రాలకు సరఫరా చేస్తున్నామని చెప్పారు. నాణ్యత విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పరితో పాటు కర్నూలు డివిజన్‌లోని కొన్ని ప్రాంతాలకు సరఫరా చేసిన పప్పుశనగ విత్తనాలు కొంత నాసిరకంగా ఉన్నట్లు తేలిందని, వెంటనే ఆ విత్తనాలను వెనక్కి పంపి మళ్లీ నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేసినట్లు తెలిపారు. తమ సిబ్బందితో పాటు వ్యవసాయాధికారులు, రైతు సలహా కేంద్రాల సిబ్బంది వివిధ దశల్లో పప్పుశనగ విత్తనాలను పరిశీలించిన తర్వాతనే రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం పప్పుశనగ విత్తనాల ధరను క్వింటానికి రూ.9 వేల ప్రకారం నిర్ణయించిందని, ఈ విత్తనాలను శుద్ధి చేసి, రైతు సలహా కేంద్రాలకు చేరవేసే బాధ్యతను కూడా ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులే తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. అందువల్లనే ధర పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

కొత్త దుకాణాలు పాత ధరలు

తొలి రోజు తెరుచుకున్నది 54 దుకాణాలే..

సాంకేతిక లోపంతో మద్యం సరఫరా ఆలస్యం



కర్నూలు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల కేటాయింపులో కీలక ఘట్టం ముగిసింది. దీంతో దుకాణాల ఏర్పాటులో ప్రైవేట్ మద్యం వ్యాపారులు హడావిడిగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పాత పద్ధతిని రద్దు చేసి కొత్త మద్యం విధానం తెరమీదకి తెచ్చి బుధవారం నుంచి అమలులోకి తీసుకువచ్చింది. జిల్లాలో 99 మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫై చేసి లాటరీ ద్వారా కేటాయించింది. అందులో బుధవారం 54 దుకాణాలు మాత్రమే తెరుచుకున్నాయి. నూతన మద్యం పాలసీ అమలులోకి రావడంతో నాణ్యమైన మద్యంతోపాటు ధరలను తగ్గిస్తామని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ మద్యం దుకాణాల్లో యథావిధిగా అధిక ధరలకే మద్యాన్ని విక్రయిస్తున్నారు. పేరుకే కొత్త దుకాణాలని, ధరలు మాత్రం తగ్గలేదని మందు బాబులు మద్యం దుకాణాల వద్ద వ్యంగ్యంగా మాట్లాడుకుంటూ కనిపించారు. దుకాణాలు దక్కించుకున్న వారు అద్దెకు షాపులు దొరకక.. సర్వర్ లోపంతో మద్యం అందక మందుబాబులు నిరాశలో ఉన్నారు. ఇష్టమైన మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రావడంతో కొంత సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్త ధరలకు సంబంధించి జీవో జారీ అయినప్పటికీ అమలుకు కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాల్సి ఉందని ఐఎంఎల్ డిపో అధికారులు తెలిపారు.

షాపులు అద్దెకు దొరకక అవస్థలు

కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని పట్టణాలు, పత్తికొండ, ఆలూరుల్లోని పలు మండలాల్లో మద్యం దుకాణాల కోసం చాలా మందికి అద్దె షాపులు దొరకడం లేదు. దొరికినా యాజమానులు అద్దెలు అధిక మొత్తంలో చెబుతుండడంతో లైసెన్సుదారులు ఆందోళన చెందుతున్నారు. దరఖాస్తు చేసినప్పుడే మాట్లాడుకున్న వారు మాత్రమే ప్రస్తుతం దుకాణాలను ప్రారంభించారు. జిల్లాలో చాలా వరకు షాపులు దొరకక మద్యం లైసెన్స్ పొందిన వారు అవస్థలు పడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో రాజకీయ నాయకులు తమ పలుకుబడితో ఇతరులకు షాపులను అద్దెకు ఇవ్వకుండా వాటా కోసం లైసెన్స్‌దారులను వేధిస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.

సర్వర్ లోపంతో సరఫరా ఆలస్యం..

జిల్లా కేంద్రంలోని పందిపాడులోని ఐఎంఎల్ డిపోలో సరుకు సిద్ధంగా ఉన్నప్పటికీ మంగళవారం రాత్రి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్టాక్ వివరాలు సాఫ్ట్ వేర్‌లో అప్‌లోడ్ సమస్యతో దుకాణాలకు కొత్త మద్యం సరఫరా కొంత ఆలస్యమవుతోందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.



గుడి, బడికి దూరంగా ..

బడికి, గుడికి దూరంగా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని కొన్ని నిబంధనలను విధించింది. నూతన మద్యం పాలసీలో నిబంధనల మేరకు దుకాణాల ఏర్పాట్లను పరిశీలించి శాశ్వత అనుమతులు మంజూరు చేస్తారు. అందులో ప్రధానంగా ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలకు వంద మీటర్లకు పైగా దూరం ఉంటేనే మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన దేవదాయశాఖ ఆలయాలు, మసీదులు, చర్చిలకు వంద మీటర్లకు అవతల వైపు ఏర్పాటు చేసుకోవచ్చు. నగర పాలక, పురపాలక సంస్థల పరిధిలో జాతీయ, రాష్ట్ర రహదారులు వెళ్లినా మద్యం దుకాణాల ఏర్పాటుకు అభ్యంతరం లేదు. 20 వేలకన్నా జనాభా తక్కువ గల గ్రామాల మీదుగా జాతీయ, రాష్ట్ర రహదారులు వెళుతుంటే 220 మీటర్లకు దూరంగా దుకాణాలు ఉండాలని, 20 వేల జనాభాకన్నా అధికంగా ప్రజలు ఉన్న గ్రామాల్లో జాతీయ, రాష్ట్ర రహదారులు హైవేలకు 500 మీటర్లకు దూరంగా ఏర్పాటు చేసుకోవచ్చని ప్రభుత్వ నిబంధనలను విధించింది.

వసతి గృహం తనిఖీ



తనిఖీ చేస్తున్న కార్యదర్శి శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గార్గేయపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి బుధవారం తనిఖీ చేశారు. హాస్టల్ రికార్డులు, విద్యార్థులకు అందజేస్తున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత పరిశుభ్రతను తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ వసతి గృహంలో ఏవైనా లోపాలు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి: ఎమ్మెల్యే



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అధికారులకు సూచించారు. గూడూరులోని వెలుగు కార్యాలయంలో బుధవారం మండలస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. భూముల ఆన్‌లైన్ సమస్యలు, రోడ్లు, తాగునీరు, విద్యుత్ సరఫరా, డంప్‌యార్డ్‌తో ఇబ్బందులు పడుతున్నామని మునగాల, మల్లాపురం గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా రావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో శివనాగప్రసాద్, కమిషనర్ నాగరాజు, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, టీడీపీ నాయకులు సృజన్, పౌలు, సురేష్, మహేశ్వర రెడ్డి, చాంద్‌బాషా, విజయ్‌కుమార్, వహీద్ పాల్గొన్నారు.

నర్సుల అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు



ఎన్నికల అధికారికి నామినేషన్లు అందజేస్తున్న ఇరు ప్యానెల్ల సభ్యులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ)కు ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల రేడియాలజి విభాగంలో జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ ఆఫీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.చెన్నమ్మ నామినేషన్లను స్వీకరించారు. అధ్యక్ష పదవికి మూడు, కోశాధికారి పదవికి మూడు నామినేషన్లు రాగా మిగిలిన పదవులకు రెండు చొప్పున నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి చెన్నయ్య తెలిపారు. ఈ నెల 23న ఎన్నికలు జరుగుతాయని, ఈ ఎన్నికల్లో గుర్తులు ఉండవని, అభ్యర్థి మాత్రమే ఉంటుందని, అక్కడ ఓటర్లు మార్కు చేయాలన్నారు.

అధ్యక్షురాలుగా ఆదిలక్ష్మి నామినేషన్: ఎన్నికల్లో ఓ ప్యానల్‌కు అధ్యక్షురాలిగా కర్నూలు జీజీహెచ్‌కు చెందిన హెడ్ నర్సు పి.ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా డి.మంజులదేవి (కర్నూలు జీజీహెచ్ స్టాఫ్ నర్సు), కోశాధికారి జి.విజయమ్మ (హెడ్ నర్సు కర్నూలు జీజీహెచ్), వైస్ ప్రెసిడెంట్ వి.శ్రీదేవి (హెడ్ నర్సు కర్నూలు జీజీహెచ్)తో పాటు ఈసీ సభ్యులుగా పి.లీలారాణి, కే శ్రీదేవి, ఎం.కళ్యాణి, కె.సుజాత, జి.రమణిదేవి నామినేషన్లు వేశారు.

అధ్యక్షురాలిగా ఎం.లీలావతి నామినేషన్: మరో ప్యానల్‌కు కర్నూలు జీజీహెచ్‌కు చెందిన హెడ్ నర్సు మండ్ల లీలావతి, ప్రధాన కార్యదర్శిగా సి.బంగారి (కర్నూలు జీజీహెచ్ స్టాఫ్ నర్సు), కోశాధికారి ఎన్.లక్ష్మీనరసమ్మ (గోనెగండ్ల పీహెచ్‌సీ హెడ్‌నర్సు), వైస్ ప్రెసిడెంట్‌గా జి.శాంతిభవాని (నర్సింగ్ కాలేజీ కర్నూలు పీహెచ్ఎన్‌టీ), ఈసీ సభ్యులుగా యూఎం శాంతిలత, జే ఉమారాణి, ఎ.ఉమాదేవి, డి.కృష్ణవేణి, ఎస్.సోమేశ్వరి నామినేషన్లను వేశారు. అధ్యక్ష పదవికి స్వతంత్ర అభ్యర్థిగా కర్నూలు జీజీహెచ్‌కు చెందిన హెడ్ నర్సు కే ఉమా నామినేషన్ వేశారు.

భార్య హత్య కేసులో భర్త అరెస్టు



పక్కీరప్పను అరెస్టు చేసిన పోలీసులు

గోనెగండ్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని కులుమాల గ్రామంలో కృష్ణవేణి (27)ని హత్య చేసిన భర్త పక్కీరప్పను అరెస్టు చేసినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. ఈనెల 13న మద్యం తాగడానికి పక్కీరప్ప భార్య కృష్ణవేణిని డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో పక్కీరప్ప కృష్ణవేణి తలపై రాతి కొట్టి హత్య చేశాడు. కృష్ణవేణి తండ్రి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బుధవారం సాయంత్రం కులుమాల, చిన్నమరివీడు గ్రామాల మధ్య నల్లపోచమ్మ గుడి దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతు న్న వ్యక్తిని విచారించగా పక్కీరప్ప అని తెలియడంతో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మంత్రాలయం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపిన వివరాలివీ.. ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామానికి చెందిన గొల్ల హనుమప్ప (42) మంత్రాలయం మండలంలోని వగరూరు గ్రామంలో మంగళ వారం దస్తగిరి స్వామి ఉరుసుకు వచ్చారు. అయితే సాయంత్రం తర్వాత తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే వగరూరు సమీపంలోనే ఎదురుగా వస్తున్న బైకు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన హనుమప్పను కర్నూలు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందు తూ బుధవారం మృతిచెందారు. హనుమప్పకు భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. హనుమప్ప మృతదేహానికి కర్నూలు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య



యూనుస్ (ఫైల్)

కర్నూలు క్రైమ్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పందిపాడు గ్రామంలో అప్పుల బాధ తాళలేక షేక్ యూనుస్ (56) ఆత్మహత్య చేసుకు న్నాడు. యూనుస్ స్థానికంగా పాన్‌షాపులో పని చేస్తుండేవాడు. ఆయన కు ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. కుటుంబ పోషణ కోసం రూ.4 లక్షల అప్పులు చేశాడు. మంగళవారం యూనుస్ కూతురు డెలివరీ కావడంతో అందరూ ఆసుపత్రికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. రాత్రి ఇంటికి వచ్చిన భార్య, కుటుంబ సభ్యులు గుర్తించి కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య జులేఖాబి ఫిర్యాదు చేశారు.

పెళ్లింట విషాదం



కల్వర్టులో పడిపోయిన బైక్, మృతి చెందిన రాముడు

- రోడ్డు ప్రమాదంలో పెళ్లి కూతురు సోదరుడి మృతి
- నిలిచిపోయిన పెళ్లి వేడుక

కర్నూలు క్రైమ్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెల్లారితే పెళ్లి.. బంధువులంతా ఆటోలో బయలుదేరారు. ఇంటికి పెద్ద దిక్కయిన ఆ కొడుకు వారందరినీ సాగనంపి ఇంటికి తాళం వేసి తాను బయలుదేరాడు. మార్గమధ్యలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. దీంతో పెళ్లి ఆగిపోయింది. ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాముడు (19) అనే యువకుడు దుర్మరణం చెందాడు. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన సువర్ణమ్మ, గిడ్డయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం. గిడ్డయ్య పదేళ్ల క్రితం మృతి చెందడంతో సువర్ణమ్మ తన భర్త ఊరు వెంకటగిరి గ్రామం వదిలేసి పుట్టినిల్లయిన కల్లూరు మండలం కే మార్కాపురంలో నివాసం ఉంటోంది. పెద్ద కూతురుకు ఇదివరకే పెళ్లి చేసింది. చిన్న కూతురుకు పుల్లగుమ్మికి చెందిన ఓ యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం ఉదయం 10 గంటలకు తలంబ్రాలు ఉండడంతో కుటుంబ సభ్యులంతా బంధువులతో కలిసి బొలేరో వాహనంలో మంగళవారం రాత్రి కే మార్కాపురం నుంచి బయలుదేరారు. రాముడు బంధువులనంతా సాగనంపి ఇళ్లంతా సర్దిన అనంతరం ఇంటికి తాళం వేసి తన మిత్రుడు కేసుల స్వామితో కలిసి మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. చిన్నటేకూరు సమీపంలో మట్టి కుప్పలు అడ్డంగా ఉండటాన్ని చీకటిలో గుర్తించలేని రాముడు మోటారు సైకిల్‌ను వాటిపైకి ఎక్కించాడు. దీంతో అదుపు తప్పి పక్కన ఉన్న కల్వర్టులో పడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత బంధువులకు సమాచారం ఇవ్వడంతో పెళ్లికి బయలుదేరిన బృందమంతా తిరిగి ఆసుపత్రికి చేరుకుంది. చికిత్స పొందుతూ రాముడు తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. దీంతో పెళ్లి ఆగిపోయింది. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీరుగారిన ఆశలు



ప్రాతకోటలో ధాన్యం తడవకుండా పట్టలు కప్పిన దృశ్యం

- గోదాములు నిర్మించారు.. వదిలేశారు
- నీరు కారుతుండడంతో నిరుపయోగంగా బహుళ ప్రయోజన గోదాములు
- ధాన్యాన్ని కాపాడుకోవడానికి అన్నదాతల అవస్థలు



పడమర ప్రాతకోటలో నిరుపయోగంగా ఉన్న గోడౌన్

పగిడ్యాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు నిరుపయోగంగా మారాయి. దీంతో రైతులు పండించిన దిగుబడులను నిల్వ చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో డీసీసీ బ్యాంక్, నాబార్డు నిధుల కింద ఏడాది క్రితం మండలంలోని పగిడ్యాల, లక్ష్మాపురం, ప్రాతకోట, ముచ్చుమర్రి, నెహ్రూనగర్ గ్రామాలల్లో పగిడ్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఐదు గోదాములను నిర్మించారు. ప్రాతకోట, పగిడ్యాల, ముచ్చుమర్రి గ్రామాల్లో 1000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకోవవడానికి ఒక్కో గోదాము నిర్మాణానికి రూ. 80లక్షలు, నెహ్రూనగర్, లక్ష్మాపురం గ్రామాల్లో 500 టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి ఒక్కో గోదాముకు రూ.45 లక్షలు ఖర్చు చేసి మినీ గోదాములను నిర్మించారు. ఎన్నికల ముందు ఈ గోదాములను శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరితో పాటు ఆయా శాఖల అధికారులు ఆరు నెలల క్రితం ప్రాతకోట గ్రామంలో అట్టహాసంగా ప్రారంభించారు. దీంతో గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని ఈ గోదాములలో నిల్వ చేసుకోవచ్చని సంతోషించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు విస్తారంగా కురువడంతో కేసీ కాలువ, బోరుబావుల కింద రైతులు మొక్కజొన్న పంటను ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. ప్రసుత్తం పంటలను రైతులు నూర్పిడి చేసి కల్లాల్లో, రోడ్ల వెంట విత్తనాలను ఆరబోసుకున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మూడు రోజుల నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో రైతులు ధాన్యాన్ని గోదాములలో నిల్వ చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే గోదాములు వరాలు కురిసినప్పుడు వర్షపు నీరు కారడం, ధాన్యం నిల్వ చేసుకుంటే రాత్రి సమయంలో ధాన్యానికి తగిన రక్షణ లేకపోవడంతో గోదాములలో ధాన్యం నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. చేతికి వచ్చిన పంటలను కల్లాల్లో నిల్వ చేసుకోని వర్షానికి తడవకుండా పట్టలను కప్పి ఉంచారు. భారీ వర్షాలు కురుస్తే ధాన్యం తడిసిపోయి నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పగిడ్యాల సహకార సొసైటీ సీఈవో ఖాజామోహిద్దిన్ అడుగగా ఆయా గ్రామాల్లో నిర్మించిన గోదాములు వర్షానికి నీరు కారడంతో ధాన్యం భద్రపరుచుకునేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయామని చెప్పారు. గోదాములకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు.

స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ



ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. సాక్షిగణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమం ఆకట్టుకుంది.

- శ్రీశైల మహాక్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం భ్రమరాంబికాదేవికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకులు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జితసేవలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ. 1,116 సేవా రుసుమును చెల్లించి పాల్గొనవచ్చు. కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మొత్తం 24 మంది భక్తులు ఈ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఈ పరోక్షసేవ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు సూచించారు.
- అన్నప్రసాద వితరణ విభాగాన్ని ఈవో డి.పెద్దిరాజు బుధవారం పరిశీలించారు. వంటశాలలో వండిన వంటకాలు, ప్రాంగణాన్ని, వంటపదార్థాలు, కూరగాయలు భద్రపరచే గదులను పరిశీలించారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరిస్తున్న భక్తులతో అన్న ప్రసాద వితరణపై భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రాబోవు కార్తీకమాసంలో భక్తులరద్దీకి అనుగుణంగా అన్నప్రసాద వితరణ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

పాణ్యం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఈసీఈ విద్యార్థి జి.వేణు సౌత్ జోన్ జాతీయ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుప్పం యూనివర్సిటీలో జరిగిన సౌత్ జోన్ జాతీయ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీలలో ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరులో చెన్నైలోని అలగప్ప యూనివర్సిటీలో జరిగే జాతీయ క్రీడల్లో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు. ఈమేరకు జేఎన్‌టీయూఏ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి, కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, ఎండీ శివరాం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ వెంకటేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం

- వర్షాలతో మొక్కజొన్న రైతులకు నష్టం



పాములపాడులో మొక్కజొన్న ధాన్యాన్ని పట్టాలతో కప్పిన దృశ్యం

పాములపాడు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గతనెల రోజులుగా తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తుండంతో చేతకొచ్చిన మొక్కజొన్న పంట వర్షాలకు తడిసి ముద్దవుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల వాతవరణం పొడిగా ఉండటంతో 50శాతం మంది రైతులు పంటలు కోసుకొని సొమ్ము చేసుకొన్నారు. రెండురోజుల క్రితం తిరగి తుపాను కారణంగా వర్షాలు పడుతుండటంతో పంటకోసి ఆరబోసిన రైతులు, కోతకు వచ్చిన వర్షాలకు భయపడి కోయకపోవడంతో పొలంలోనే పంట నేలకొరిగి మొలకలు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కొత్తపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మండలంలో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మండలంలోని దుద్యాల, కొత్తపల్లి, సింగరాజుపల్లి, శివపురం, లింగాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, ఎదురుపాడు తదితర గ్రామాల్లో రైతులు చేతికొచ్చిన మొక్కజొన్న ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం నిల్వ ఉంచుకునేందుకు ఇళ్లల్లో స్థలాలు లేకపోవడంతో అధిక శాతం రైతులు గ్రామ శివారులోని బీడు భూములు, వ్యవసాయ కల్లాల్లో ధాన్యాన్ని ఆరబోసుకున్నారు. వర్షం పడుతుందని తెలిసినప్పటికీ వేరే దారి లేక టార్పాలిన్లతో కప్పినప్పటికీ ధాన్యం కింది బాగం నుంచి వర్షం నీరు చేరుతుండటంతో పూర్తిగా తడిసిపోవడంతో రైతన్నలు కన్నీరు మున్నీరుతో విలపిస్తున్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.



శివపురం శివారులో..

శాశ్వత అన్న ప్రసాద వితరణ పథకానికి విరాళం

శ్రీశైలం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం అనకాపల్లికి చెందిన ఎస్. చంద్రమౌళి అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

విగ్రహ ప్రతిష్ఠ

పాములపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జూటూరు గ్రామ శివారులోని శ్రీనాగసాయి విద్య బ్రహ్మ ఆశ్రమంలోని ఆవరణలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పీఠాధిపతి రామనందస్వామి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి, లక్ష్మీ సమేత నరసింహ స్వామి, ధన్వంతరి, పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి, పీఠాధిపతి మాతృమూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు.

'వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలి'

నందికొట్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గం లోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం నియోజకవర్గ నాయకుడు గుజ్జుల గౌరీశ్వర నాయుడు కోరారు. బుధవారం నందికొట్కూరులో ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. జయంతిని ప్రభుత్వం నిర్వహించడం సంతోషకరమన్నారు. గురువారం జరిగే భగవత్ వాల్మీకి జయంతిని నందికొట్కూరులోని కోటా హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీవీబీఎస్ నాయ కులు రాంబాబు, విజయ శేఖర్, పసుల శ్రీనివాసులునాయుడు, పుల్లయ్య దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో మద్యం పట్టివేత

శ్రీశైలం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పరిధిలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి మద్యం బాటిళ్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలివీ.. శ్రీశైలం గ్రామానికి చెందిన బోయ రమేష్, వినుకొండకు చెందిన డోకు మల్లేశ్వరరావు ఇరువురి వద్ద ఎనిమిది(180 ఎంఎల్) మద్యం బాటిళ్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువతి మృతదేహం లభ్యం

పాణ్యం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్‌బీ కెనాల్‌లో కొట్టుకుపోయిన మహిళ వెన్నెల (20) బనగానపల్లె రవ్వలకొండ సమీపంలోని ఎస్ఆర్‌బీ కెనాల్‌లో మృతదేహంగా లభ్యమైనట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 12న పాణ్యం గోరుకల్లు తండా సమీపంలోని ఎస్ఆర్‌బీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయిన గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన వెన్నెల ఆచూకీ కోసం ఐదు రోజులుగా కెనాల్ వెంట పోలీసు, రెవెన్యూ శాఖలు గాలింపు చేపట్టినట్లు తెలిపారు. ఈమేరకు వెన్నెల మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. వెన్నెల భర్త జార్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కెనాల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని ఎవరూ కెనాల్‌లో దిగవద్దని సూచించారు.

కనీస సౌకర్యాల కల్పనే లక్ష్యం: ఎమ్మెల్యే



బిజినవేములలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలం లోని బిజినవేముల గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల్లో కనీస సౌకర్యాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించి పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకొచ్చేందుకు ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ రవియాదవ్ ఎంపీడీవో సుబ్రమణ్యశర్మ, సచివాలయ సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పగిడ్యాల: పగిడ్యాల, ప్రాతకోట, రైతుపల్లె గ్రామాల్లో బుధవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే జయసూర్య భూమిపూజ చేశారు. పీఆర్ ఈఈ రఘురాంరెడ్డి, ఎంపీడీవో సుమిత్రమ్మ, బీజేపీ నియోజకవర్గ నాయకుడు దామోదర్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వరరెడ్డి, ప్రాతకోట సర్పంచ్ శేషమ్మ, వాసురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగశేషులు, వెంకట్‌రెడ్డి, శేష, కర్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడులోని బీసీ కాలనీతో పాటు మరో రెండు చోట్ల పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిరకు భూమిపూజ నిర్వహించారు. టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, గోవిందు, చంద్రశేఖర్, పూసల కృష్ణ, హఫీజ్, మల్లీశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలో సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచు బాలయ్య, ఎంపీటీసీలు వెంకటమ్మ, కృపాకర్, టీడీపీ నాయకులు జంగాల పెద్దన్న, టీడీపీ నాయకులు బాబు, మోహన్‌రావు, గోపి, అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: వీరాపురంలో సర్పంచ్ సరస్వతమ్మ అధ్యక్షతన పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. బీసీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు కర్నాటి శివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మహానంది: తమ్మడపల్లి, అల్లీనగరం, శ్రీనగరం, మహానంది గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీపీ యశస్విని, టీడీపీ నాయకులు శ్యామల జనార్దన్‌రెడ్డి, సుంకులయ్య, హరిశ్చంద్రప్రసాద్, గంగిశెట్టి మల్లికార్జునరావు అధికారులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరు, శింగవరం, రామాపురం, సోమయాజులపల్లె గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, జాకీర్, చెన్నారెడ్డి, ఈశ్వరరెడ్డి, రామసుబ్బయ్య, ధనుంజయగౌడ్, నబీరసూల్, సుబ్బలక్ష్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

గోస్పాడు: గోస్పాడు, ఒంటివెలగల తదితర గ్రామాలలో పల్లె పండుగ కార్యక్రమాలను నిర్వహించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ తులసీశ్వరరెడ్డి, సహకార సొసైటీ మాజీ చెర్మన్ భాస్కరరెడ్డి, నాయకులు వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ప్రమీల, భూమా వృశేని, బాలన్న, అధికారులు పాల్గొన్నారు.

గడివేముల: కరిమద్దెల, పెసరవాయి గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. పెసరవాయి గ్రామంలో రైతులకు గోనే సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, వడ్లు లక్ష్మీదేవి, శివారెడ్డి, వడ్డు ప్రశాంతి, రమణయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు ఎస్పీ సన్మానం



పోలీస్ అధికారిని సన్మానిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న పలువురు పోలీస్ అధికారులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళుతున్న సందర్భంలో బుధవారం ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వారిని సన్మానించారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో పదోన్నతిపై ఏవోగా అనంతపురం జిల్లా 14వ బెటాలియన్‌కు బదిలీపై వెళ్తున్న నిజాముద్దీన్, ఆర్ఐగా పదోన్నతిపై ఆక్టోపస్‌కు వెళుతున్న బి.రామ్మోహన్, బదిలీపై వెళుతున్న ఆర్ఎస్ఐ వీరన్నను ఎస్పీ ఘనంగా సన్మానించి వారికి ఆత్మీయ వీడ్కోలు పలికారు. అలాగే జిల్లా పోలీస్ అధికారులు, డీపీవో కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఆర్మ్‌డు రిజర్వు డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ మంజునాథ్, ఖాదర్ వలి, కవిత, సురేష్, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

ఫ్లై ఓవర్‌పై అదుపుతప్పిన లారీ

పాణ్యం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైవే ఫ్లైఓవర్ పై బుధవారం లారీ అదుపు తప్పింది. నంద్యాల నుంచి మంత్రాలయానికి ఇనుప తుక్కు సామాను లోడుతో వెళ్తున్న లారీ పాణ్యం సమీపంలోని ఫ్లైఓవర్‌పై ఇరుసు విరిగి అదుపుతప్పి పక్కనున్న రక్షణ గోడవరకు వచ్చి నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడడంతో సర్వీసు రోడ్డుకు వాహనాలను మళ్లించారు. రేపటి వరకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఉండొచ్చని హైవే పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

మిడుతూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సుంకేసుల గ్రామంలో బుధవారం ఉరుములు, మెరుపుల వర్షంలో పిడుగుపడి ఎద్దు మృత్యువాత పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగు వెంటయ్య తన వరి చేనుకు మందు చల్లేందుకు ఎద్దుల బండిపై ఎరువుల మందును ఎత్తుకొని పొలానికి వెళ్లాడు. పొలం వద్ద ఎద్దులను చెట్లకు కట్టేసి వెంకటయ్య భార్య ఇద్దరు కలిసి వరిచేనులో ఎరువుల మందు చల్లుతున్నారు. ఉరుము, మెరుపులతో వర్షం పడుతుండగా పిడుగు పడి ఎద్దు మృతి చెందిందని వారు తెలిపారు. దాదాపు రూ.60 వేల విలువ గల ఎద్దు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంట నమోదు జాబితా ప్రదర్శన

ఆత్మకూరురూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన ఈ పంట నమోదు జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శనకు ఉంచామని ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతు సేవా కేంద్రాలలో సంప్రదించి సరిచేసుకోవాలని రైతులకు సూచించారు. అభ్యంతరాలు తెలియజేస్తే, వాటిని సరి చేసి ఈ నెల 18 వ తేదీన తుది జాబితాను తయారు చేసి తిరిగి ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

సబ్ జైలు తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ

నందికొట్కూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ బి.లీలావెంకటశేషాద్రి బుధవారం నందికొట్కూరు సబ్ జైలును తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జైలులో ఉన్నటువంటి ఖైదీలను విచారించి వారికి న్యాయ సలహాలు ఇచ్చారు. న్యాయవాదిని నియమించుకునే స్తోమతలేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని నియమించనున్నట్లు తెలిపారు. అనంతరం జైలు పరిసరాలు, ఖైదీలకు వడ్డించే ఆహారం, సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితుల గురించి విచారించారు. కార్యక్రమంలో జైలు విజిటింగ్ లాయర్ అరుణ్‌కుమార్, జైలు సూపరింటెండెంట్ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.

'చిరుత జాడ గుర్తింపునకు సీసీ కెమెరాలు'



సీసీ కెమెరాను ఏర్పాటు చేస్తున్న అటవీ అధికారులు

మిడుతూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మిడుతూరు గ్రామ సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ వద్ద చిరుత పులి జాడ గుర్తించేందుకు రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు రోళ్లపాడు అభయ అరణ్య డీఆర్‌వో జిషాన్ తహేర్ తెలిపారు. చిరుత పులి జాడ ఉందని తెలిస్తే చిరుతను పట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎఫ్‌బీవో శ్రీనివాసులు, సిబ్బంది వాసు, నాగరాజు ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు సమాన అవకాశాలు: కలెక్టర్

నంద్యాల కల్చరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజంలో పురుషులు, స్త్రీలతో పాటు ట్రాన్స్‌జెండర్లకు కూడా సమాన అవకాశాలు కల్పిస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో బుధవారం ట్రాన్స్‌జెండర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 240 మంది పింఛన్ పొందుతున్నట్లు, వైద్యశాఖ నివేదికల్లో 690 మంది ఉన్నట్లు, ఎన్జీవో సంస్థలు వెయ్యిమంది ఉన్నట్లు రకరకాల గణాంకాలు చెబుతున్నాయని తెలిపారు. నిజమైన ట్రాన్స్‌జెండర్లు ఏఏ ఏరియాలో ఉన్నారు, ఎంత మందికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఓటర్‌కార్డులు ఉన్నాయి ప్రస్తుతం వారు చేస్తున్న పనులు, వారితో పాటు జీవిస్తున్న వ్యక్తులు తదితర వివరాలను వారంరోజుల్లో ఇవ్వాలని అధికారులను, ఎన్జీఓ సంస్థలను కలెక్టర్ ఆదేశించారు. సమాజంలో ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతికి వికలాంగుల శాఖ పనిచేస్తుందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో 42 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నారన్నారు. ట్రాన్స్‌జెండర్లకు రేషన్, ఓటరు, ఆధార్ కార్డుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. పింఛన్ పొందుతున్న 240 మంది ట్రాన్స్‌జెండర్లను 24 స్వయం సహాయక సంఘాలుగా 15 రోజుల్లో ఏర్పాటుచేసి విధివిధానాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ డీఆర్‌డీఏ, మెప్మా పీడీలను ఆదేశించారు. జిల్లాలో హౌసింగ్ స్కీమ్ కింద కేటాయించిన 70 మంది ఐడీ వివరాలను తీసుకొని విచారిస్తామన్నారు. అలాగే నూతన పాలసీ ప్రకారం జిల్లాలోని అందరి ట్రాన్స్‌జెండరలకు గృహాలు కేటాయిస్తామన్నారు. మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించి ట్రాన్స్‌జెండర్ల సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు.

'భూములు ఇవ్వాలి'

ఆత్మకూరురూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం గూడెంలోని గిరిజనులకు సాగుకు యోగ్యమైన ప్రభుత్వ భూములను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏసురత్నం,మండల కార్యదర్శి నరసింహనాయక్ కోరారు. అమలాపురం గూడెంలో అమలాపురం, ఇందిరేశ్వరం గూడేలకు చెందిన గిరిజనులతో బుధవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మినీ అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఇళ్ల స్థలాలు లేని వారిని గుర్తించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇందిరేశ్వరం గ్రామం నుంచి ఇందిరేశ్వరం గూడెం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు సుధాకర్, వెంకటేశ్వర్లు,మూగమ్మ, నాగమ్మ, గురువమ్మ, అంకన్న పాల్గొన్నారు.

మహానందిలో అటవీశాఖ సంరక్షకుడి పూజలు



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న కన్జర్వేటర్

మహానంది, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మహానందిలో అటవీ శాఖ టైగర్ ప్రాజెక్ట్ సంరక్షకుడు ఐఎఫ్ఎస్ బీవీఏ కృష్ణమూర్తి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయనకు ఆలయం ముఖద్వారం వద్ద అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో కన్జర్వేటర్ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కల్యాణ మంటపంలో వేదపండితులు శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఈశ్వరయ్య, డీఆర్వో నాగేంద్ర, శ్రీనివాసులు, ఎఫ్‌బీవో ప్రతాప్ ఉన్నారు.

ఆత్మకూరులో రోడ్ల విస్తరణకు శ్రీకారం

- పలు చోట్ల ఆక్రమణలను తొలగించిన మున్సిపల్ యంత్రాంగం
- త్వరలో మరిన్ని ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో రోడ్ల విస్తరణకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. రద్దీగా ఉండే పాతబస్టాండ్ రోడ్డు, కేజీ రోడ్డుతో పాటు నేతాజీనగర్, కప్పకుంట తదితర ఏరియాల్లో రోడ్లకు ఇరువైపులా ఉండే అక్రమణలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే పట్టణంలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారికి ఇరువైపుల ఉండే పలు అక్రమణలను తొలగించిన మున్సిపల్ అధికారులు తాజాగా బుధవారం తెల్లవారుఝాము నుంచే పాతబస్టాండ్ నుంచి గౌడ్‌సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఆక్రమణలను, అనుమతిలేని నిర్మాణాలను తొలగించారు. నిజానికి పట్టణంలో అత్యంత రద్దీ ఉండే ఈ రహదారికి ఇరువైపుల ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది ఆక్రమించి అనుమతి లేని నిర్మాణాలను ఏర్పాటు చేసి వాటికి మున్సిపల్ శాఖ నామమాత్రపు రుసుములు చెల్లించి ఇతరులకు అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఈ రోడ్డుపై తరుచూ ట్రాఫిక్ జామ్ చోటుచేసుకుని ప్రజలు అసౌకర్యానికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు కీలక నిర్ణయం తీసుకుని ఆక్రమణల తొలగింపు పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. అదేవిధంగా గౌడ్ సెంటర్ నుంచి కర్నూలుకు వెళ్లే రస్తా, కప్పలకుంట, నేతాజీనగర్‌లో రోడ్లను విచ్చలవిడిగా ఆక్రమించడం వల్ల ఆయా ఏరియాల్లో రద్దీ పెరిగి జనం ఇక్కట్లకు లోనవుతున్నారన్న విషయాలను గుర్తించి ఆయా ఆక్రమణదారులకు కూడా నోటీసులను జారీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రెండు, మూడు రోజుల్లో ఆయా ఏరియాల్లోని ఆక్రమణలను కూడా తొలగిస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. కొంత మంది వ్యాపారులు మున్సిపల్ అధికారులను ప్రాధేయపడినప్పటికీ పోలీసుల సమక్షంలో ఆక్రమణల తొలగింపు పనులు కొనసాగించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ జనాభా పెరిగిన దృష్ట్యా ఇరుకు రహదారులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రజల సౌకర్యార్థం ఆక్రమణలను తొలగిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా ఆక్రమణదారులు తమ దుకాణాల పరిధి దాటి ముందుకు రావద్దని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

తైక్వాండో పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కోవెలకుంట్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ తైక్వాండో పోటీల్లో కోవెలకుంట్లకు చెందిన సెయింట్ జోసెఫ్ స్కూ లు విద్యార్థిని శాన్విత ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ గీత తెలిపారు. బుధవారం ఆమె విద్యార్థినిని అభినందిం చా రు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ జాన్‌మేరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిపాడులో అంటువ్యాధులు

ప్యాపిలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు ఎస్సీ కాలనీలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మురుగు నీరు నిలుస్తోంది. గతనెల రోజులుగా ఇదే పరిస్థితి అక్కడ నెలకొంది. అధికారులకు చెప్పిన ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. మురుగుతో కాలనీలో దుర్వాసన వస్తుం దని, దీంతో ప్రజలకు అంటు రోగాలు ప్రబలుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో నిలిచిన మురుగునీరు తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి

శిరివెళ్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప అన్నారు. శిరివెళ్లలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివే దికలను వివరించారు. సమావేశంలో తహసీల్దార్ పుష్పకుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు ఉపాధి పనులు



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

దొర్నిపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లోని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించా లని డ్వామా పీడీ జనార్దన్‌రావు సూచించారు. బుధవారం ఎంపీ డీవో సావిత్రి ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో బహి రంగ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1నుంచి 2024మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులకు సం బంధించి రికార్డులను పరిశీలించారు. ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఏపీడీలు భాస్కర్‌నాయుడు, సాంబశివుడు, ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, అంబు డ్స్ పర్సన్ సురేంద్రకుమార్, జిల్లా విజిలెన్స్ కమిటీ అధికారులు బా లాజీనాయక్, షిబారాణి, ఎంపీడీవో సావిత్రి, ఏపీవో గంగన్న, ఈసీ సోమశేఖర్ తదితరులున్నారు.

గ్రామాలకు నిలిచిన రాకపోకలు

రుద్రవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం 30.23 మి.మీ. వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధి కారులు తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలిచింది. పత్తి, మొక్కజొన్న వరి పంట పొలాలు నీటితో నిండాయి. వాగులు పొంగి ప్రవహించాయి. రుద్రవరం - నంద్యాల ఆర్టీసీ సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆళ్లగడ్డ వైపు కొంత మంది, గాజులపల్లె వైపు మరికొంత మంది వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పేరూరు, చిలకలూరు, ఎర్రగుడిదిన్నె వక్కిలేరు వాగు పొంగి ప్రవహించింది. దీంతో రాకపోకలు నిలిచాయి.

పల్లె ప్రగతే లక్ష్యం: ఎమ్మెల్యే కోట్ల

డోన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిరునాంపల్లి గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే కోట్ల భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గ్రామాల అభివృద్ధిని అసలు పట్టించుకోలేదన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీల బలోపేతానికి అవసరమైన నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, గిరిప్రసాద్ రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ నాగమణి, ఏఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాలను అభివృద్ధి చేసేందుకే పల్లె పండుగ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మంజులవాణి తెలిపారు. బుధవారం మండలంలోని ముత్యాలపాడు, తోడెండ్లపల్లె, చక్రవర్తులపల్లె గ్రామాల్లో రూ.58 లక్షల ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను టీడీపీ నాయకులు, ఎంపీడీవో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఏఈ జగ్గయ్య, ఏపీవో నిర్మల, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రదీప్, టీడీపీ నాయకులు ఇండ్ల లక్ష్మిరెడ్డి, రమణారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : పల్లెపండుగ కార్యక్రమంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పెద్దకొప్పెర్ల సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నకొప్పెర్ల మాజీ సర్పంచ్ బుచ్చన్న, గోవిందిన్నె నాయకులు బాలరాజు అన్నారు. బుధవారం కోవెలకుంట్ల మండల పరిధిలోని పెద్దకొప్పెర్ల, చిన్న కొప్పెర్ల, గోవిందిన్నె గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు, పీఆర్‌ఏఈ చెంచయ్య, ఏపీవో శ్రీవిద్యలు కలిసి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం, గోపాల్ పాల్గొన్నారు.

బనగానపల్లె: టీడీపీ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు, రామకృష్ణాపురం గ్రామాల్లో ని ర్మించనున్న సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం పీడీవో రమణ, పలుకూరు మేజర్ గ్రామ పంచాయితీ ఈవో బాలాంజనేయులు టీడీపీ నాయకుడు వల్లెపుశంకర్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఏపీవో రేష్మా, టీప మగ్బుల్, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాపిలి: గ్రామీణ రోడ్లకు ప్ర భుత్వం ప్రాధాన్యం కల్పిస్తున్నదని ఎంపీడీవో శ్రీనివాస రావు అన్నారు. బుధవారం మండలం లోని జలదుర్గం, గార్లదిన్నె, అలే బాదు, మాధవరం గ్రామాల్లో పల్లే పండుగ వారోత్స వాలు నిర్వహించారు. ఈవోఆర్డీ బాల క్రిష్ణుడు, పీఆర్‌ఏఈ ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు సీమ సుధాకర్‌రెడ్డి, అలేబాదు పరమేష్, మాధవరంస్వామి అధి కారులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పన, గ్రామాల అభి వృద్ధే ధ్యేయంగా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఫజల్ రెహిమాన్ అన్నారు. బుధవారం మండలం లోని గోర్లగుట్ట, హెచ్.కొట్టాల, రెహిమాన్‌పురం, గుటుపల్లె గ్రామ పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజలు చేశారు. కార్యక్రమంలో తహ సీల్దార్ ప్రకాష్‌బాబు, పీఆర్ ఎస్ఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: గ్రామాల అభివృద్ధి టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ మండల నాయకులు కత్తి రాందాస్ అన్నారు. బుధవారం మండలంలోని కమ్మవారిపల్లె, కోటపాడు, పెద్దవెంతుర్ల, తిమ్మనాయినిపేట గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకులు తిమ్మనాయినిపేట గోపాల్, గిరి, కోటపాడు శివరామిరెడ్డి, సూరి, అధికారులు పాల్గొన్నారు.



తిరునాంపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



పలుకూరులో భూమి పూజ చేస్తున్న మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు



పెద్ద కొప్పెర్లలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి



కొల్లిమిగుండ్ల: సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు కత్తి రాందాస్

సోలార్ ప్లాంటు భూముల పరిశీలన

అవుకు, అక్టోబరు 16, (ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా అవుకు మండలం జూనూతల గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రీన్‌కో సోలార్ ప్లాంటుకు గత వైసీపీ ప్రభుత్వం కేటాయించిన భూములను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డోన్ ఆర్డీవో మహేశ్వరరెడ్డి బుధవారం పరిశీలించారు. డబ్బులు చెల్లించిన భూములను స్వాధీనం చేయాలని గ్రీన్‌కో అధికారులు ప్రభుత్వాన్ని కోరగా జాయింట్ కలెక్టర్, ఆర్డీవో భూములను పరిశీలించేందుకు వచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణదేవి, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, సర్వేయర్ హరిక్రిష్ణ, వీఆర్‌వో శివయ్య పాల్గొన్నారు.



భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

22న జాబ్ మేళా

డోన్ రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 22న ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాబ్‌మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. పదవ తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీకి చెందిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

చాగలమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): శనగ విత్తనాలకు ఆర్‌బీకేలలో రైతులు రిజిస్ట్రేషన్‌లు చేసుకోవాలని ఏవో రంగనేతాజీ అన్నారు. బుధవారం మూడో ఆర్‌బీకే కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు రబీ సీజన్ కింద 800 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. మల్లేవేముల, పెద్దబోదనం, నేలంపాడు, మద్దూరు, పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లోని రైతులకు 25 శాతం సబ్సీడితో శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, అస్రఫ్ పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు వర్షాలు కురుస్తుండటంతో అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో మంజులవాణి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ బంగాళాఖాతం అల్పపీడన ప్రభావం వల్ల రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో ప్రజలు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని సూచించారు. గ్రామాల్లో మట్టి మిద్దెల్లో నివసించే వారు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

డోన్ రూరల్: వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామ సమీపంలోని పంట పొలాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వేరుశనగ, కంది, ఆముదం మొక్కజొన్న పంటలు ప్రమాదస్థాయిలో పడ్డాయని ఏడీఏ అన్నారు. రైతులు పలు జాగ్రత్తలు తీసుకుని పంటలను కాపాడుకోవాలని సూచించారు.

వైభవంగా దస్తగిరి స్వామి జెండా ఊరేగింపు

చాగలమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో గ్యార్మి పండుగ సందర్భంగా బుధవారం దస్తగిరిస్వామి జెండాను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. వర్షంలోనే దస్తగిరిస్వామి జెండాలను ఊరేగించారు. ఆయా వీధుల్లో మహిళలు జెండాల వద్దకు వెళ్లి ఫాతెహాలు చేసి మొక్కుబడి తీర్చుకున్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి: సీపీఎం

డోన్(రూరల్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామనగర్, ఆటోనగర్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయలకొండ నాగరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు చిన్న రెహిమాన్‌లు డిమాండ్ చేశారు. పట్టణంలోని తారకరామనగర్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం తారకరామ్‌నగర్ పార్టీ శాఖ కార్యదర్శి అక్బర్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గోపాలస్వామి ఊరేగింపు

కోవెలకుంట్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల మండలం వల్లంపాడు గ్రామంలో గోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా బుధవారం గ్రామంలో అర్చకులు నరేశ్‌శర్మ ఆధ్వర్యంలో ఊరేగింపుగా నిర్వహించారు. అనంతరం గోపాల స్వామివారికి ధాన్యాలతో నింపారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు.

ఇద్దరికి జైలు, జరిమానా

ఉయ్యాలవాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు కోవెలకుంట్ల సివిల్ కోర్టు న్యాయాధికారి జైలు, జరిమానా విధించినట్లు ఉయ్యాలవాడ ఎస్ఐ రామాంజనేయరెడ్డి బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ సమీపంలోని కుందరవాగు వంతెన వద్ద వాహన తనిఖీ చేపడుతుండగా ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన బైరీ ప్రసాద్, నాగేళ్ల సునీల్ ఆటోలు అతి వేగంగా వెళ్లడం గుర్తించామన్నారు. వాహనాలను ఆపి డ్రంకెన్‌డ్రవ్ పరీక్షలు నిర్వహించగా, మద్యం తాగినట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి న్యాయాధికారి ముందు హాజరు పరచగా ఒకొక్కరికి రూ. 5000 జరిమానాతో పాటు నెల రోజులు జైలు శిక్ష విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

మహా పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన ఎగువ అహోబిలంలో వార్షిక పవిత్రోత్సవంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అహోబిలేశ్వరులు యాగశాల నుంచి గర్భాలయానికి వేంచేసిన అనంతరం కుంభ ప్రోక్షణం జరిగింది. దీంతో ఎగువ అహోబిలంలో పవిత్రోత్స వాలు ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, లోక సుభిక్షం కోసం చేపట్టిన పవిత్రోత్సవాలు దిగువ అహోబిలంలో బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రహ్లాదవరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో విశేష పూజలు నిర్వహించారు.

బనగానపల్లెలో భారీ వర్షం



తిమ్మాపురం వద్ద వాగు ఉధృతిగా ప్రవహించడంతో ఆగిపోయిన వాహనాలు

బనగానపల్లె, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. తుఫాన్ ప్రభావంతో బనగానపల్లె మండలంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు 5.14 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. టంగుటూరు గ్రామ సమీపంలో వాగు ఎక్కి ప్రవహించింది. దాంతో ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. అలాగే తిమ్మాపురం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో బనగానపల్లె నుంచి నంద్యాల వైపు వెళ్లే వాహనాలకు సుమారు 4 గంటల వరకు రెండువైపులా వాహనాలు ఆగిపోయాయి. ఇక వ్యవసాయానికి సంబంధించి మొక్కజొన్న పంట కోసిన రైతులు తీవ్ర అగచాట్లు పడ్డారు. తుఫాన్ ప్రభావం వల్ల వర్షం భారీగా కురవడంతో బనగానపల్లె మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు, పాఠశాలలు, కళాశాలలు పూర్తిగా మూసివేశారు.

కొలిమిగుండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఎడతెరిపి లేకుండా జోరుగా కురిసిన వర్షంతో వివిధ వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామున ప్రారంభమైన వర్షం ఉదయం 11గంటల వరకు కొనసాగింది. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అయితే భారీ వర్షం నమోదు కాకా పోవడంతో రైతులకు నిరాశ తప్ప లేదు. మండలంలో బుధవారం ఉదయం నుండి సాయంత్రం వరకు 16మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో బాస్కరరెడ్డి వెల్లడించారు.

శిరివెళ్ల, అక్టోబరు : మండలంలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. శిరివెళ్ల నుంచి రుద్రవరానికి వెళ్లే ప్రధాన రహదారిలోని మాలమాగు వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మోత్కలపల్లె, యర్రగుంట్ల తదితర గ్రామాల్లో వరి పైర్లు నేలవాలాయి. తహసీల్దార్ పుష్ప కుమారి, ఎస్ఐ చిన్న పీరయ్య వాగు వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

డోన్(రూరల్): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో బుధవారం తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు డోన్ ప్రాంతంలో వర్షం దంచికొట్టింది. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో వర్షం నీరు చేరింది. దీంతో విద్యార్థులకు సెలవుదినంగా ప్రకటించి ఇళ్లకు పంపారు. అలాగే పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పలు గ్రామాల్లో కురిసిన వర్షాలకు పొలాల్లో వర్షం నీరు వచ్చి చేరుతుంది. రెండు రోజుల పాటు వర్షాలు ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫీ సూచించారు.